ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
మంగళవారం 21 మే 2024

మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు



అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

- నదీతీరాల్లో ఇసుక సరఫరా చేయరాదు
- తాగునీటి సమస్య లేకుండా చూడాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ విజయరామరాజు ఆదేశం

కడప(రూరల్) మే 20 : ఎన్నిల కోడ్ అమలుకు ముందు ఆమోదం పొంది పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ హాలులో జేసీ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌వో గంగాధర్ గౌడ్‌లతో కలిసి అభివృద్ధి పనుల పురోగతి, రెవెన్యూ సర్వీసులు, లీగల్ అంశాలు, సచివాలయ సేవలు, ప్రభుత్వ భవన నిర్మాణాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై అధికారులు అందరూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా మండలాలు, మున్సిపాలటీల పరిధిలో గృహనిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ప్రతి గురువారం మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పారిశుధ్యంపై ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మీ-సేవ, ఏపీ సేవా పోర్టల్‌లో ప్రతిరోజు విధిగా సర్వీస్ రిక్వెస్టులను పరిశీలించి సంబంధిత రిపోర్టులు, పరిష్కార నివేదికలను నమోదు చేయాలన్నారు. పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు అసౌకర్యం లేకుండా తరగతి గదుల మరమ్మతులు చేయాలని, నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. ప్రస్తుతం నదీతీరాల్లో ఎక్కడ కూడా ఇసుక సరఫరా చేయడానికి వీలులేదన్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారులకు కమ్యూనికేషన్ నెట్‌వర్క్ మెరుగ్గా నిర్వహించడానికి, రెవెన్యూ సర్వీసులపై సమీక్షించేందుకు ప్రతి మండలానికి కమ్యూనికేషన్ సెట్స్ ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలతో పాటు నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎపీడీవోలు, హౌసింగ్, డ్వామా, డీఆర్‌డీఏ, పీఆర్ అధికారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

వారిద్దరూ నెంబర్ వన్ రౌడీషీటర్లు

- రాచమల్లును, బంగారురెడ్డిని పోలీసులు నగర బహిష్కరణ చేయాలి
- కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ శివచంద్రారెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, మే 20: ప్రొద్దుటూరులో రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, పాతకోట బంగారు మునిరెడ్డిలే నెంబర్‌వన్ రౌడీషీటర్లని వారిద్దరినీ పోలీసులు నగర బహిష్కరణ చేయాలని కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కొర్రపాడు రోడ్డులోని ఆయిల్ మిల్లులో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో పోలీసులు నిష్పక్షపాతంగా ఎన్నికల్లో పనిచేశారని, గెలిచేది తామే అని బంగారురెడ్డి మీడియాతో చెప్పారన్నారు. మరెందుకు ఒన్‌టౌన్ పోలీసు స్టేషనుకు వెళ్లి సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను బెదిరించారని ప్రశ్నించారు. మావాడు నవీన్‌రెడ్డిని వెంటనే పంపకుంటే మరోతాడిపత్రి అవుతుందని సీఐని బంగారు రెడ్డి ఫోన్‌లో బెదిరించలేదా అన్నారు. రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తుంటే స్టేషను నుంచి నవీన్ కుమార్‌రెడ్డి అనే అతనిని స్వయంగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారురెడ్డి తీసుకెళ్లడం ఎందుకని ప్రశ్నించారు. బంగారురెడ్డి రౌడీషీటర్ కాదా.. ఒన్‌టౌన్‌లో అతనిపై రౌడీషీట్ (నెంబర్ 765) లేదా సమాధానం తెలపాలన్నారు. గత నాలుగునెలల కాలంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై నాలుగు బెదిరింపు కేసులు, దౌర్జన్యం కేసులు నమోదయ్యాయన్నారు. వీరు రౌడీషీటర్లు కాకుండా పెద్దమనుషులు ఎలా అవుతారో పోలీసులు సమాధానం చెప్పాలన్నారు. నిన్నటికి నిన్న ఎన్నికలలో టూటౌన్ సీఐని, రాజుపాళెం ఎస్‌ఐని ఆఖరికి డీఎస్పీని సైతం ఫోన్‌లో దారుణంగా ఎమ్మెల్యే మాట్లాడింది ఫోన్ రికార్డింగ్ సాక్ష్యం ఉందన్నారు. ఇన్ని కేసులు మీమీద పెట్టుకుని ఎలక్షన్ రోజున తనమీద 307 సెక్షన్ కింద తప్పుడుకేసు నమోదు చేశారన్నారు. ఎస్‌ఐ హైమావతి మీద ఇసుక మాఫియా దాడి చేస్తే ఎమ్మెల్యేగా ఉండి ఎందుకు నిందితులను అరెస్టు చేయించలేదని అడిగారు. మీ వాళ్లే ఆమె మీద దాడిచేశారు కాబట్టి మీరు నాడు నోరుమెదపలేదన్నారు. మీ అరాచక పాలన జూన్ 4న ముగియనుందన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సభ్యుడు వెల్లాల భాస్కర్, దుగ్గిరెడ్డి రఘునాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఎటువైపో..?





సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగి వారం దాటింది. ఓటర్లను ఆకర్షించేందుకు అధికార పార్టీ రకరకాల ప్రయత్నాలు చేశారు. చివరకు ఓటుకు నోటిచ్చారు. జిల్లాలో బద్వేలు, పులివెందుల, ప్రొద్దుటూరులో వైసీపీ పంపిణీ చేసిన స్థాయిలో ఓటుకు నోటు ఇవ్వడానికి ప్రతిపక్ష పార్టీలు సాహసించలేకపోయని అంటారు. ప్రొద్దుటూరులో అదికార పార్టీ రూ.2500, బద్వేలులో రూ.1500, పులివెందులలో రూ.2000 పంపిణీ చేస్తే, ప్రతిపక్ష పార్టీలు సగం మాత్రమే ఇచ్చాయంటారు. అయితే జగన్ ప్రభుత్వంపై అటు సొంత పార్టీలోనే కాదు సామన్యుల్లో కూడా వ్యతిరేకంగా ఉన్నారనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో కొత్త ఓటర్లు, మహిళా ఓటర్లు ఎటువైపు పడ్డాయనే చర్చ నడుస్తోంది. తాము ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను తీసుకున్న మహిళలందరూ వైసీపీకి గంపగుత్తగా ఓటేశారని తిరిగీ తామే అధికారం చేపడతామని ఆ పార్టీవారు అంటున్నారు. ఇక జగన్ పాలనలో సామాన్యులను మోసం చేశారు. కరెంటు బిల్లు, చెత్తపన్ను, ఆస్తిపన్ను విధించి జనాన్ని బాదేశారు. అయితే జగన్ పెంచిన పన్నుల భారం, కరెంటు బిల్లు, చెత్తపన్ను, అద్దె ఇంటిపై పడుతుంది. అందుకే ఓట్లన్నీ తమకేనని టీడీపీ భావిస్తోంది. పన్నులు పెరగడంతో మహిళల్లో చాలా వ్యతిరేకత ఉందంటారు.



మైదుకూరులో ఈనెల 13న ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు

- ఈ ఎన్నికల్లో గెలుపోటముల నిర్ణేతలు వారే
- మొత్తం ఓట్లు 16,39,066
- పోలైనవి 13,04,256
- పురుషుల ఓట్లు 6,34,349
- మహిళల ఓట్లు 6,85,822
- పోలింగ్‌లోను వారిదే పైచేయి
- ఈ ఓట్లు మావే అంటే.. మావే అంటూ అంచనాల్లో ఇరుపార్టీలు

కడప, మే 20 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని మహిళా ఓట్లపైనే ఇప్పటికీ చర్చ నడుస్తోంది. జనం ఓటేసి వారం దాటినా అభ్యర్థులు ఇంకా కాకిలెక్కల్లో బిజీగా ఉన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ నమోదు వివరాలు పూర్తిగా ఆయా వర్గాలకు చేరిపోయాయి. పోలైన ఓట్లలో కొత్త ఓటర్లు, మహిళలు, సంప్రదాయ ఓటర్లు ఇలా అన్నిటిని క్రోడీకరించుకుని గెలుపు మాదే గెలుపు మాదే అంటూ ఆనందపడుతున్నారు.

జిల్లాలో ఉన్న ఓటర్లలో సగం మందికిపైగా మహిళలు ఉన్నారు. ఇప్పుడు ఓటింగ్‌లో కూడా పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. మహిళా ఓట్లు మావే అంటూ అటు వైసీపీ, ఇటు టీడీపీ సంబరపడుతున్నాయి. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే ఓటర్లు పోటెత్తారని మాదే గెలుపంటూ వైసీపీ అంటోంది. ఇక జగన్ పాలనలో తీవ్ర నష్టం జరిగింది. ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అంటూ టీడీపీ చెప్పింది. తెలంగాణలో మహిళలు ఫ్రీగా తిరుగుతున్నారు. ఇక జగన్ రూపాయి ఇచ్చి పన్నుల ద్వారా మరోచేత్తో లాగేసుకుంటున్నారనే విమర్శ ఉంది. అందుకే ఇప్పుడు మహిళలు ఎటు మొగ్గుచూపారనే చర్చ నడుస్తోంది.

41473 మంది అధికం

జిల్లాలో మొత్తం ఓటర్లు 16,39,066 ఉండగా వారిలో ఓటేసింది మాత్రం 13,04,256 మంది మాత్రమే. అంటే 79.57 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులోనూ పురుషులు 6,34,349 మంది మాత్రమే ఓటేశారు. అంటే పురుషుల పోలింగ్ శాతం 48.63 శాతం. మహిళలు 6,85,822 మంది ఓటేశారు. పురుషులకంటే 41473 మంది అధికంగా ఓటేశారు. మహిళల పోలింగ్ శాతం 51.87 శాతం. మహిళలే పురుషులకంటే అన్నింటా ఆధిక్యం అని పోలింగ్‌లోనూ నిరూపించుకున్నారు. అధికంగా పోలైన ఆ 41473 ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించనున్నాయి. కాగా జిల్లా కేంద్రమైన కడప నియోజకవర్గంలో పోలైన ఓట్లు 1,85,079. ఇందులో మగవారివి 47.83 శాతం కాగా.. మహిళలవి 52.14 శాతం.

నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు..

నియోజకవర్గం	మొత్తంఓట్లు	పోలైనవి	పురుషులు(శాతం)	మహిళలు(శాతం)
కడప	2,83,543	1,85,079	88,536 (47.83)	96,511 (52.14)
ప్రొద్దుటూరు	2,42,556	1,97,349	95,260 (48.27)	1,02,062 (51.71)
మైదుకూరు	2,11,855	1,79,692	87,872 (48.9)	97,819 (54.43)
బద్వేలు	2,19,290	1,72,660	84,491 (48.93)	88,127 (51.04)
పులివెందుల	2,29,687	1,86,834	91,484 (48.96)	95,340 (51.02)
కమలాపురం	2,04,169	1,72,401	83,917 (48.67)	88,472 (51.31)
జమ్మలమడుగు	2,42,556	2,10,241	1,02,789 (48.89)	1,07,491 (51.12)
మొత్తం	16,39,066	13,04,256	6,34,349 (48.63)	6,85,822 (51.87)

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప(క్రైం), మే20: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4వ తేదీన జరగనున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గొడవలు జరగకుండా నిఘా ఉంచాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నోడల్ పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ పార్టీల నేతలు, వారి అనుచరులు గొడవలు చేసేందుకు, కవ్వింపు చర్యలకు దిగే అవకాశం ఉందన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేస్తు నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లోసారి సుధాకర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మైన్స్ లోపాలపై డీఎంఎస్ విచారణ

- ఏపీఎండీసీ కార్మిక సంఘం నాయకుడి ఫిర్యాదుతో..



బ్లాస్టింగ్ పాయింట్‌లను పరిశీలిస్తున్న డీఎంఎస్ అధికారి

ఓబులవారిపల్లె, మే 20: ఏపీఎండీసీ మంగంపేట సంస్థలో సంస్థ నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదుతో నెల్లూరు రీజియన్ డివిజన్ సేఫ్టీ అధికారి కోటంనాయుడు ఏపీఎండీసీ మైన్స్ కార్యాలయంలో సోమవారం విచారణ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్లాస్టింగ్ ఇన్‌ఛార్జ్‌ని నియమించకుండా రోజుకు ఒక సెకండ్ క్లాస్ మేనేజర్‌తో బ్లాస్టింగ్ చేయడం రూల్స్‌కు వ్యతిరేకమన్నారు. డీడీఎంఎస్‌కు కార్మికుల తరఫున ఫిర్యాదు చేస్తే మైన్స్ మేనేజర్ అశోక్‌కు ఇన్‌చార్జ్ అప్పగించినా ఏజెంటు ఆర్డర్ ఆపుతూ ఇంకో ఆర్డర్ ఇచ్చారని, దీనిపై విచారణ జరిపి ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. అనుభవం లేని వారితో బ్లాస్టింగు చేయించడం వల్ల ప్రమాదాలు జరగడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. సర్వేయర్ బెనర్జీ రిటైర్డ్ అయిన నాటి నుంచి సర్వేయర్‌ను అధికారికంగా నియమించకనే మైనింగ్ పనులు నిర్వహించడం చట్ట విరుద్ధమన్నారు. అలాగే గత నెలలో మైన్స్ మేనేజర్‌కు తెలియకుండా కంటైనర్‌కు వెల్డింగ్ చేయించడం, ఫైర్ సేఫ్టీ పాటించకుండా కంటైనర్ కాలిపోవడంతో సుమారు రూ.10 లక్షలు ఏపీఎండీసీ సంస్థకు నష్టం చేశారని, ఈ విషయాన్ని డీడీఎంఎస్ అధికారులకు తెలియకుండా దాచారని తెలిపారు. మైన్స్ మేనేజర్‌కు తెలియకుండా ఇలాంటి చర్యలకు అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిహెచ్ చంద్రశేఖర్ సమక్షంలో ఏజెంట్, సీపీవో సుదర్శన్‌రెడ్డి, మైన్స్ మేనేజర్ గోపీనాథ్, మెకానికల్ మేనేజర్ చలపతిరెడ్డిలతో డీఎంఎస్ కోటంనాయుడు విచారణ నిర్వహించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మైనింగ్‌ను, కాలిపోయిన కంటైనర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు : ఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం, మే 20: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు పూర్తిచేశామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. సోమవారం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కౌంటింగ్‌కు సంబంధించి పోలీసు అధికారులతో జరిపిన సమీక్షలో ఎస్పీ మాట్లాడారు. కౌంటింగ్ నేపథ్యంలో జూన్ 1 నుంచి 6వరకు ఎలాంటి ఊరేగింపులు, విజయోత్సవాలకు అనుమతి లేదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రాజకీయ నేతల గృహనిర్బంధం, జిల్లా బహిష్కరణ అమలు చేస్తామన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. సమీవేశంలో ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్, ఏటీ ఇన్‌స్పెక్టర్ రాజు, సీఐలు శ్రీకాంత్, అబ్దుల్ కరీం, వెంకటరమణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల గొడవలపై అడిషనల్ డీజీ విచారణ?

కడప(క్రైం), మే20: స్వారత్రిక ఎన్నికల సందర్భంగా కడప, కమాలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరులలో జరిగిన గొడవలపై సోమవారం అడిషనల్ డీజీ సునీల్‌కుమార్ విచారించినట్లు సమాచారం. ఎన్నికల సందర్భంగా వైసీపీ నేతలు పలుచోట్ల కవ్వింపు చర్యలకు దిగారు. అక్కడక్కడా టీడీపీ, వైసీపీ మధ్య గొడవలు చోటుచేసుకున్నాయి. ఈఘటనలపై డీజీ సంబంధిత అధికారులను కడప పోలీసు గెస్టహౌస్‌కు పిలిపించుకొని విచారించినట్లు తెలుస్తోంది. పోలీసులు అధికార పార్టీ నేతలకు సహకరించారంటూ టీడీపీ నేతలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ విచారణ సాగినట్లు తెలుస్తోంది.

పోలింగ్‌కు రెండురోజుల ముందు వైసీపీ ప్రభుత్వం హడావిడి చేసింది. విద్యాదీవెన నిధులు లబ్ధిదారులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసి ఓట్లు కొట్టేయాలని చూసింది. దీనికి ఎన్నికల కమిషన్ బ్రేక్ వేసింది. మార్చి1వ తేదీన బటన్ నొక్కి.. రెండు నెలలు ఆగి పోలింగ్‌కు ముందు వేయడం ఏంటని ప్రశ్నించింది. ఆ రెండురోజులు ఆగి పోలింగ్ అయిపోగానే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమచేసుకోవచ్చని చెప్పింది. పోలింగ్ ముగిసినా డబ్బులు జమకాలేదు. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం జమచేస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఈ డబ్బు కొందరి ఖాతాల్లో మాత్రమే పడింది. దీంతో మిగిలిన విద్యార్థులు తమకు విద్యాదీవెన లభిస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

‘దీవెన’ లభించేనా..?

- మార్చి 1న బటన్ నొక్కితే..
- రెండు నెలల తరువాత నిధులు విడుదల
- అదీ కొందరి అకౌంట్లలోనే జమ
- మిగిలిన విద్యార్థుల్లో ఆందోళన



కడప (ఎర్రముక్కపల్లె), మే 20: జగనన్న విద్యాదీవెన డబ్బులు కొంత మందికే జమ అవుతుండడంతో మిగిలిన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలోనూ కొంతమంది సొమ్ములు అందక నష్టపోయారు. ఇప్పుడు కూడా అటువంటి పరిస్థితి ఎదురవుతున్నదేమోనన్న ఆందోళనలో ఉన్నారు. 2023-24 విద్యాసంవత్సరం తొలి త్రైమాసికం (అక్టోబరు, నవంబరు, డిసెంబరు) ఫీజు చెల్లింపునకు ఈ సంవత్సరం మార్చి 1న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. డబ్బులు మాత్రం పడలేదు ఇటీవల విద్యాదీవెనతో పాటు ఇతర పథకాలకు సంబంధించిన నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

రూ.34.52 కోట్లు జమ కావాలి

జిల్లాలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో 44,876 మంది చదువుతున్నారు. వీరికి తొలి విడతగా రూ.34.52 కోట్లు జమకావాల్సి ఉంది. అయితే కొందరి అకౌంటులో డబ్బులు జమకాగా.. చాలామందికి రాలేదు. ఇదే ఇప్పుడు ఆందోళనకు గురిచేస్తోంది. ఈ మొత్తం తొలి త్రైమాసికానికి సంబంధించింది. మరో మూడు విడతలకు సంబంధించిన మొత్తాలు ఇంకా విడుదల కావాల్సి ఉంది. అవన్నీ ఎప్పుడు వేస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

విద్యార్థుల వివరాలు

2023-24 విద్యాసంవ్సరానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా పూర్తిస్థాయి రీయింబర్స్‌మెంటు అందాల్సిన విద్యార్థులు జిల్లాలో 44,876 మంది ఉన్నారు. వీరందరి ఉన్నారు. వీరందరి తల్లుల ఖాతాల్లో రూ.34 కోట్ల 52 లక్షల 64 వేల 997 జమకావాల్సి ఉంది. ఎస్సీ సంక్షేమం కింద 8,193 మందికి రూ.5.33 కోట్లు, ఎస్టీ సంక్షేమం కింద 677 మందికి రూ.46.35 లక్షలు జమ కావాల్సి ఉంది. బీసీ సంక్షేమం కింద 16,587 మందికి రూ.12.36 కోట్లు, ఈబీసీ కింద 7,587 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.7.70 కోట్లు జమ కావాల్సి ఉంది. ఆలాగే కాపు సంక్షేమానికి సంబంధించి 6,141 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.5 కోట్లు, ముస్లిం మైనార్టీలకు సంబంధించి 5,591 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.3.58 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీకి సంబంధించి 100 విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.7.6 లక్షలు జమ కావాల్సి ఉంది.

తీవ్ర జాప్యంతో విద్యార్థులకు అవస్థలు

సీఎం జగన్ షెడ్యూలు ప్రకారం బటన్ నొక్కడం తప్ప సకాలంలో డబ్బులు జమ చేసింది లేదని విద్యార్థులు అంటున్నారు. కళాశాల యాజమాన్యాలతో తమకు ఇబ్బంది తప్ప ఈ విధానం వల్ల ఉపయోగం లేదన్న భావనను ఎప్పటి నుంచో వ్యక్తం చేస్తున్నారు. 2023-24 విద్యాసంవత్సరం తొలి త్రైమాసకానికి సంబంధించి సొమ్మును ప్రభుత్వం విడుదల చేయనప్పటికీ యాజమాన్యాల ఒత్తిడితో విద్యార్థులు ఇప్పటికే చెల్లించినట్లు సమాచారం. దాదాపు 90 శాతం మంది ఫీజులు చెల్లించారు. ఆర్థిక ఇబ్బందులతో పది శాతం మంది చెల్లించలేదు. వీరంతా ప్రభుత్వం విడుదల చేసే నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. గతవారం కొంత మంది విద్యార్థులకు జమకాగా.. మిగిలిన వారికి వచ్చేందుకు ఇంకెన్ని రోజులు పడుతుందో చూడాలి. ప్రతిసారి కొంతమంది విద్యార్థులకు విద్యాదీవెన చెల్లింపుల్లో ప్రభుత్వం కోత విధిస్తోంది. ఈ సారి ఎంతమందికి ఈ సమస్య ఎదురవుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



120 మామిడి చెట్లను నరికేశారు

- రూ.8లక్షల నష్టం
- లబోదిబోమన్న బాధిత రైతులు

చక్రాయపేట, మే 20: గుర్తు తెలియని దుండగులు కాపుకొచ్చిన 120 మామిడిచెట్లను రాత్రికిరాత్రే నరికేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు..

చక్రాయపేట మండలం, మారెళ్లమడక గ్రామంలో మాజీ సర్పంచు బొజ్జ పార్థసారధిరెడ్డి, బొజ్జ వాసుదేవరెడ్డి, బొజ్జ యోగాంజులరెడ్డిలకు పక్కపక్కనే మామిడితోటలు ఉన్నాయి. కొన్నిచెట్లకు పది సంవత్సరాల వయసు కాగా.. మరికొన్నింటికి ఐదారు సంవత్సరాల వయసు. ఇక ప్రతి ఏడాది కాపుకొస్తాయని సుమారు రూ.4లక్షల ఆదాయం వస్తుందని రైతులు ఆశించారు. సోమవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో బొజ్జ వాసుదేవరెడ్డి తోటకు నీరు పారగట్టేందుకు తోట వద్దకు వెళ్లాడు. అప్పటికే గుర్తు తెలియన వ్యక్తులు చెట్లు నరికేస్తుండడాన్ని గమనించి పరుగున గ్రామానికి వెళ్లి మనుషులను పిలుచుకొచ్చాడు. అప్పటికే దుండగులు పారిపోయారు. మారెళ్లమడక గ్రామానికి కూతవేటు దూరంలోనే వాసుదేవరెడ్డికి, యోగాంజులరెడ్డిలకు చెందిన 90 మామిడిచెట్లు, బొజ్జ పార్థసారధికి చెందిన 30 మామిడిచెట్లను గుర్తు తెలియని దుండగులు నరికేశారు. దుండగులు కొడవలిని వదిలేశారు. ఈ మేరకు సీఐ గోవిందరెడ్డి, ట్రిపుల్‌ఐటీ ఎస్‌ఐ రంగనాథం సంఘటన స్థలాన్ని పరిశీలించి డాగ్‌స్క్వాడ్‌ను రప్పించారు. అయినా ఆధారాలు దొరకలేదు. దాదాపు రూ.8లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. కన్నబిడ్డల్లా సాక్కున్న మామిడిచెట్లను నరికేయడం చూసి వారు లబోదిబోమంటున్నారు. వీరు ఎవరితోనూ గొడవలకు రారని, కక్షలు కార్పణ్యాలకు దూరంగా ఉంటారని.. అయినా వీరిచెట్లను నరికేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ప్రభుత్వం న్యాయం చేయాలి..

గ్రామంలో మాకు ఎవరితోను గొడవలు లేవు. మాపై కక్ష ఎవరికి ఉందో తెలియడం లేదు. దాదాపు రూ.8లక్షల విలువలైన మామిడిచెట్లను నరికేశారు. ప్రభుత్వం న్యాయం చేయాలి.



- బొజ్జ వాసుదేవరెడ్డి, రైతు, మారెళ్లమడక, చక్రాయపేట





మారెళ్లమడక గ్రామంలో దుండగులు నరికిన మామిడిచెట్లు

కమనీయం రమణీయం

చెన్నకేశవ స్వామి కల్యాణం


చెన్నకేశవస్వామి, శ్రీదేవి భూదేవి కల్యాణం


శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి

రాజుపాలెం, మే 20 : వెల్లాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం చెన్నకేశవస్వామి శ్రీదేవి భూదేవిల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థానం ఆవరణంలోని సంజీవరాయ స్వామి కల్యాణమండపంలో ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేసిన వేదికపై కల్యాణం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరణ చేసి ఆసనంపై కూర్చోబెట్టారు. పూలదండలు ఎదురుకోళ్ల తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జీలకర్ర బెల్లం ఉంచి వేద మంత్రాల వాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు. ప్రతి యేటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. అనంతరం భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈవో బీవీ నరసయ్య, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి హుండీ డబ్బు లెక్కింపు

రూ.3.27 లక్షల ఆదాయం


హుండీ డబ్బులను లెక్కిస్తున్న దృశ్యం

వల్లూరు, మే 20 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరి క్షేత్రంలో కొలువుదీరిన శ్రీకామాక్షి సమేత వైద్యనాథేశ్వర శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి హుండీలను సోమవారం లెక్కించారు. మొత్తం రూ.3,27,410 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఆలయ అర్చకులు, పురావస్తు సిబ్బందితో పాటు దేవదాయ సిబ్బంది, చెన్నూరు శ్రీవెంకటేశ్వర సేవా సమితి భక్తులు లెక్కింపులో పాల్గొన్నట్లు ఈవో తెలిపారు.

అక్రమ బ్లాస్టింగ్‌ను ఆపండి

- ఇళ్లు బీటలు వారుతున్నాయి...
- సీపీఎం నాయకులతో కలిసి కాలనీవాసుల నిరసన


బ్లాస్టింగ్ ఆపాలని కాలనీ వాసులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మదనపల్లె అర్బన్, మే 20: స్థానిక అమ్మచెరువుమిట్ట వద్ద అక్రమంగా చేస్తున్న బ్లాస్టింగ్‌తో ఇళ్లు బీటలు వారుతున్నాయని, పెద్దఎత్తున వస్తున్న శబ్దాలతో వృద్ధులు, చిన్నారులు భయాందోళనలకు గురవుతున్నారని, వెంటనే బ్లాస్టింగ్ ఆపాలని సీపీఎం నాయకులతో కలిసి స్థానికులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ నాయకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ మదనపల్లె మండలం కోళ్లబైలు రెవెన్యూ గ్రామంలో భూకబ్జాలు, అక్రమాలకు అంతే లేకుండాపోయిందన్నారు. సర్వే నెంబరు 529లో ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి ఇళ్లమధ్యలో ఉన్న గుట్టను బ్లాస్టింగ్ చేయడం భూమి కంపించి ఇళ్లు బీటలు వారుతున్నాయన్నారు. పక్కనే ఉన్న వెలుగు ప్రత్యేక వికలాంగుల క్షేత్రంలో మానసిక వికలాంగులు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నట్లు చెప్పారు. ఈ విషయంగా కలెక్టర్, మదనపల్లె ఆర్డీవోలు స్పందించి అక్రమబ్లాస్టింగ్‌ను ఆపాలని లేనిపక్షంలో ప్రజలందరితో కలిసి పెద్దఎత్తున్న ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాలనీ, బృందావన్ కాలనీ, జగన్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఓటు వరకే నీళ్ల నాటకం

- ముగిసిన సార్వత్రిక ఎన్నికలు
- పల్లెలకు ఆగిన నీటి సరఫరా
- అధికారులను అడగమంటున్న వైసీపీ నేతలు

ఎన్నికలు ముగియడంతో ఓటర్లతో ఇక పనేముందని వైసీపీ అభ్యర్థులు, నేతలు అనుకుంటున్నారు కాబోలు. ఇన్ని రోజులు వారి చుట్టూ తిరిగిన వారు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు. ఎన్నికలకు ముందు అధికారులపై ఒత్తిడి తెచ్చి ట్యాంకర్ల సంఖ్య పెంచి నీళ్లు సరఫరా చేయించారు. ఓట్ల కోసం ప్రజలపై ఎంతో ప్రేమ ఉన్నట్లు నీళ్ల నాటకం నడిపారు. తీరా పోలింగ్ ముగిశాక ఆ ఊసే పట్టించుకోవడం లేదు. పైగా తమకు ఓటు వేయలేదంటూ ట్యాంకర్లను నిలిపి వేయించారు. బిందెడు నీరు లేక జనం అల్లాడుతున్నా వారి మనసు కరగడం లేదు.




వానరాచపల్లె బిడికీలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు ఆర్థిక సహాయంతో తాగునీరు అందిస్తున్న దృశ్యం


జి.రెడ్డివారిపల్లెలో ప్రభుత్వ నిధులతో అందిస్తున్న తాగునీరు

సుండుపల్లె, మే 20: ఓట్ల కోసం నీళ్లనాటకం ఆడిన వైసీపీ నేతల అసలు స్వభావం ఇప్పుడు బట్టబయలైంది. పోలింగ్ ముగిసిందో లేదో.. పల్లెలకు వచ్చే తాగునీటి ట్యాంకర్లు బంద్ అయ్యాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నడూ లేనంత ప్రేమ చూపిన నాయకులు, నేతలు ఇప్పుడు ఏమయ్యారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఎన్నికల ముందు వైసీపీ నాయకులు చూపించిన ప్రేమ అంతా ఇంతా కాదు. వారి మాటలను నమ్మి మోసపోయామా అని మండల ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

రోజుకు 15 లీటర్లే..

మండలంలోని జీ.రెడ్డివారిపల్లె, చిన్నగొల్లపల్లె, పొలిమేరపల్లె, మడితాడు గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి అధికంగా ఉందని అధికారులు చెబుతున్నారు. మూడు గ్రామాల్లో మాత్రం అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఒక మనిషికి రోజుకు 15 లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఒక మనిషికి రోజుకు 15 లీటర్ల నీరు ఏ విధంగా సరిపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్నానం కోసం, తాగేందుకు ఇతర అవసరాల కోసం 15 లీటర్ల నీరు సరిపోదని కనీసం 60 లీటర్ల నీరు ఇవ్వాలని ప్రజలు వేడుకుంటున్నారు.

వాళ్లు చేతులెత్తేశారు.. వీళ్లు అందిస్తున్నారు

ఎన్నికల కోడ్ రావడానికి ముందు తమకు తాగునీటి సమస్య ఉందని ప్రజలు రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో మేమున్నాము.. మేము తాగునీటిని అందిస్తామని అధికార వైసీపీ నాయకులు, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజలపై ఎనలేని ప్రేమ చూపించారు. పల్లెలకు ట్యాంకర్ల ద్వారా ఓట్ల కోసం తాగునీటిని అందించారు. అయితే పోలింగ్ ముగిసిన తరువాత వైసీపీ నాయకులు పల్లెల్లో తాగునీటి సరఫరా పేశారు. ఎన్నికలు అయిపోయాయి కదా అధికారులు తేలుతారులే అని చెతులెత్తేయడంతో ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే టీడీపీ నాయకులు మాత్రం పోలింగ్ ముగిసిన తర్వాత కూడా తాగునీటిని ట్యాంకర్లతో అందిస్తున్నారు. తాగునీటి సమస్య ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలనుకుంటున్నామని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

కోడ్ వచ్చే ముందు నిధులు మంజూరు

ఎన్నికల కోడ్‌కు వారం రోజుల ముందు ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేశారు. తాగునీటి సమస్య ఉన్న ప్రతి గ్రామపంచాయతీలో పరిష్కరిస్తున్నామని అధికార వైసీపీ నాయకులు మండలమంతా ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి అధికార పార్టీకి చెందిన నాయకులను పిలిపించి ఎక్కడ తాగునీటి సమస్య ఉందో గుర్తించి బోర్లు వేస్తున్నామని జోరుగా ప్రచారం చేశారు. ఎన్నికల సమయం కదా.. బోర్లు వేస్తారులే అని ఆయా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూశారు. తీరా.. ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని.. ఈ రోజు రేపు వేస్తామని ఎన్నికలు అయిపోయే వరకు మాటలు చెప్పారు. ఇప్పటివరకు అనుమతులు రాలేదు. తాగునీటి సమస్య పరిష్కారం కాలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.10.6 లక్షలతో రాయవరం జంగంపల్లి, కొండల తూర్పు, సుండుపల్లె మండల కేంద్రంలోని మంగళపల్లి, మాన్యం వారిపల్లె, కోనంకివాండ్లపల్లె, దిగువనాయునివారి పల్లెలకు ప్రభుత్వ బోర్లు వేసేందుకు అధికారులు గుర్తించారు. ఎన్నికల కోడ్‌కు వారం రోజుల ముందు చెప్పడంతో అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఎన్నికల కోడ్ రావడంతో అనుమతులు రాలేదని అధికారులు చెబుతున్నారు. మరి తమకు తాగునీటి తిప్పలు తప్పవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ముక్కోటి దేవతలారా రారండి!

- పెంచలకోనలో వైభవంగా ధ్వజారోహణం
- శేషవాహనంపై నృసింహుడి వైభోగం




విద్యుద్దీపకాంతుల్లో మెరిసిపోతున్న పెంచలకోన ఆలయం.. ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు (దక్కిలి), మే 20 : పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. గరుత్మంతుడి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో తిరుచ్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. తెల్లటి గుడ్డపై పసుపు, గంథం, కుంకుమతో ప్రత్యేకంగా తయారు చేసిన గరుత్మంతుడి ప్రతిమను ధ్వజస్తంభంపై ఎగుర వేసి సకల దేవతులకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కోడిముద్ద ప్రసాదం కోసం మహిళా భక్తులు పోటీపడ్డారు. తిరుచ్చి ఉత్సవం, సహస్ర దీపాలంకారసేవ, ఊంజల్ సేవ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అలంకార మండపంలో ప్రత్యేక స్నపన తిరుమంజనాలు చేశారు. అనంతరం ఉభయ దేవేరులతో కలిసి శేషవాహనంపై కొలువుదీరిన స్వామి వారు కోనవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 6 గంటలకు స్వామిఅమ్మవార్లకు పూలంగిసేవ, 8 గంటలకు హంసవాహన సేవ, 11.30 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలంకరణ, రాత్రి 10 గంటలకు బంగారు హనుమంత సేవ జరగనుంది.




సోమవారం రాత్రి శేషవాహనంపై ఊరేగుతున్న నృసింహస్వామి.. గరుత్మంతుడి చిత్రపటం, స్వామిఅమ్మవార్ల ఊరేగింపు

ఇంధనాన్ని పొదుపుగా వినియోగించాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ కడప జోన్ ఈడీ వెంకటేశ్వరరావు

కడప (మారుతీనగర్) మే 20 : ఇంధనాన్ని పొదుపుగా వినియోగించగలిగితే సంస్థకు ఆదాయం చేకూర్చిన వారవుతారని ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. అత్యల్ప ఇంధనపొదుపు, ప్రమాద రహిత శిక్షణ తరగతులను సోమవారం స్థానిక ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్టీసీ డ్రైవర్లకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జోన్‌లో విధులు నిర్వహించే ప్రతి డ్రైవర్ విధుల నిర్వహణలో మంచి లక్ష్యంతో పనిచేసినపుడే ప్రమాదాలు నివారించడంతో పాటు మంచి ఆదాయం తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో కడప ఆర్‌ఎం పి.గోపాల్‌రెడ్డి, రాయచోటి, బద్వేల్ డిపోల మేనేజర్లు, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

మహిమాన్వితం... దేవరరాయి

- 23న నల్లగంగమ్మ తల్లి జాతర




ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ తల్లి, మహిమాన్వితమైన దేవరరాయి

సంబేపల్లె, మే 20: సంబేపల్లె గ్రామంలో వెలిసిన శ్రీదేవరరాయి నల్లగంగమ్మ తల్లి భక్తుల పాలిట కల్పవల్లిగా విరాజిల్లుతోంది. 23వ తేదీ నల్లగంగమ్మ జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మునగా మురళీస్వామి, ఈవో కొండారెడ్డి తెలిపారు. ఆలయం ముందు భాగంలో బీజాక్షరాలతో వెలిసిన దేవరరాయి మహిమాన్విత రాయిగా నిలుస్తోంది. ఈనెల 23వ తేదీ మొలకల పౌర్ణమి సందర్భంగా వైభవంగా తిరుణాలను నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవారి జాతరలో పాల్గొననున్నారు.

ఆలయ చరిత్ర

త్రేతాయుగంలో ఈ ప్రాంతం దట్టమైన అడవిగా ఉండేది. రైతులు పశువులను మేపుకునేవారు. అప్పట్లో కాలికి గాయమై కుంటుతూ నడుస్తున్న ఓ మేక ఓరోజు ఈ ప్రాంతంలోని ముళ్లపొదల్ని దాటగానే మామూలుగా నడిచింది. ఇది గమనించి ఆశ్చర్యపోయిన మేకల కాపరి ముళ్లపొదల్లో ఏదో మహాత్మ్యం ఉందన్న సంగతి గుర్తించి మిగతా పశువుల కాపర్లతో కలిసి ముళ్లపొదల్లో వెతకగా ఓ బండరాయి కనిపించింది. ఆ రాయిపై తెలియని భాషలో అక్షరాలు, ముగ్గులు ఉన్నాయి. దీనిని శక్తివంతమైనదిగా గ్రహించిన కాపరులు పూజలు చేయడం ప్రారంభించారు. ఇదే సమయంలో ఈ దారిన వెళుతున్న ఓ మహాముని పూజలు అందుకుంటున్న బీజాక్షరాలతో వెలిసిన ఈ రాయిని శక్తిదాయినిగా గుర్తించి ఎదురుగా నల్లగంగమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తూర్పున కదిరి దేవునికొండ, పడమరదుర్గం, ఉత్తరాన వెదుర్ల కొండ, దక్షిణాన ముగదాలకొండల మధ్యన వెలిసిన నల్లగంగమ్మ తల్లికి ఓ చిన్న ఆలయం నిర్మితమయ్యింది. కొన్నేళ్లపాటు ఈ గుడిలోనే పూజలందుకుంటూ వచ్చిన నల్లగంగమ్మ తల్లి దేవరరాయి నల్లగంగమ్మ తల్లిగా ప్రసిద్ధి చెందింది. ఈ క్రమంలో ఓ రోజున నల్లగంగమ్మ తల్లి రాయచోటికి చెందిన వ్యాపారి మునగా మురళీకి కలలో కనిపించి తన ఆలయాన్ని పునరుద్ధరించాలని ఆజ్ఞాపించింది. అమ్మవారి ఆజ్ఞ ప్రకారం మునగా మురళీస్వామి తన శక్తి మేరకు ఆలయాన్ని అభివృద్ధి చేసి నిత్యం పూజలు జరిగేలా విశేష కృషి చేస్తున్నారు. ఎన్నో మహిమల్ని కనబరుస్తూ భక్తుల పాలిట వరప్రదాయినిగా వెలిసిన శ్రీనల్లగంగమ్మను పొరుగు జిల్లాలతో ఇతర రాష్ట్రాల భక్తులు సైతం నిత్యం దర్శించుకుంటుంటారు.

జాతర ఏర్పాట్లు ముమ్మరం

జాతర సందర్భంగా ఈనెల 23వ తేదీ గురువారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, 9 గంటలకు హోమాలు, మధ్యాహ్నం 12 నుంచి అన్నదానం, రాత్రి 8.30 గంటల నుంచి సప్తస్వరాల ఆర్కెస్ట్రా, డీజేడీ డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, తెల్లవారుజామున చాందినీ బండ్ల మెరమణి తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ నిర్మాణకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మునగా మురళీస్వామి, కార్యనిర్వహణాధికారి కొండారెడ్డి, కమిటీ సభ్యులు గడికోట చంద్రశేఖర్‌రెడ్డి, దాతలు, పెద్దలు, భక్తులు, యువకుల సహకారంతో ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

బీసీల అభ్యున్నతికి అలుపెరగని కృషి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డిబాబు

కడప (మారుతీనగర్), మే 20: బీసీ వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరుగని కృషి చేస్తున్నట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి కాలనీలో గల ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం నూతన బా ధ్యుల నియామకం చేపట్టారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసీ పీ పాలనలో బీసీ వర్గాల అభివృద్ధి పూర్తిగా మంటగలిసిపోయిందన్నారు. 'నా ఎస్సీ, నా బీసీ' అంటూ ఉత్తుత్తి ప్రేమ ఒలకబోయడం తప్ప అణగారిన వర్గాలకు ముఖ్యమంత్రి చేసిందేమీ లేదన్నారు. కార్పొరేషన్లను తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. రానున్న కొత్త ప్రభుత్వమైనా ఆ పంథా విడనాడి బీసీల అభివృద్ధికి బాటలువేసేలా పాలన సాగించాలని ఆకాంక్షించారు. ఆ సంఘం రాష్ట్ర నూతన ఉపాధ్యక్షుడిగా తంజావూరు క్రిష్ణ కిరీటిని, అలాగే కడప జిల్లా అధ్యక్షుడిగా కదిరి ప్రసాద్ గౌడ్‌ను, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా మదన్‌మోహన్‌ను నియమించారు.


ఉత్తర్వుల పత్రాలను అందజేస్తున్న రెడ్డిబాబు

నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జమ్మలమడుగు, మే 20: జమ్మలమడుగులో సోమవారం నుంచి నారాపురం వేంకటేశ్వర స్వామి క్రోధినామ సంవత్సర వార్షిక బ్రహ్మోత్సవాలు అంకుర్పాణంతో ప్రాంభం అయ్యాయి. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో అంకురార్పణం పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో బడే గౌస్‌పీరాఖాద్రీ ఉరుసు

జమ్మలమడుగు, మే 20: జమ్మలమడుగు పట్టణంలోని పలగాడి వీధిలో వెలసిన తూగుట్లపల్లె జాగీర్దార్ హజరత్ సయ్యద్‌షా బడే గౌస్‌పీరాఖాద్రీ ఉరుసు ఉత్సవ సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గాలో పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్ల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేసి మొక్కుకున్నారు. సర్వమత సమ్మేళనం, సర్వమత పెద్దలచే ప్రసంగ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు పట్టణంలోని పెద్దలు, స్వామివారి శిష్యులు పాల్గొన్నారు.

పోలీసుల నాకాబందీ

పోరుమామిళ్ల, మే 20 : పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోరుమామిళ్ల, రంగసముద్రం పంచా యతీల్లో నాకాబందీ నిర్వహిం చారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని మరో చోట ఉత్పన్నం కాకుండా చూసేందుకు పోరుమామిళ్లలో కొందరి నివాస గృహాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అలాగే గిరినగర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న మూడు మోటారు బైకులు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ ఎవరైనా ఎంతటి వారైనా ఘర్షణ వాతావరణం సృష్టిస్తే ఉపేక్షించేది లేదని కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఉదయం జీపుల్లో పోలీసు సిబ్బంది నాకాబందీ నిర్వహించారు.

యల్లమ్మ జాతరలో అల్లర్లు వద్దు

● ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోండి ● పీస్ కమిటీ సమావేశంలో సీఐ పార్థసారథి

చెన్నూరు, మే 20: చెన్నూరులో ఈనెల 26వ తేదీ జరిగే యల్లమ్మ జాతరలో అల్లర్లకు పాల్పడవద్దని, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ పార్థసారథి గ్రామ స్థులకు సూచించారు.సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో హిందూ, ముస్లిం నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతీయేటా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, ఘర్షణ వాతావరణానికి అవకాశం ఇవ్వకుండా నిర్వహించుకుంటున్నారు కాబట్టి అదే విధంగా ఈసారి కూడా జరుపుకోవాలన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జాతర కమిటీ అధ్యక్షుడు ఆకుల ప్రసాద్‌బాబు ఇంటి నుంచి ఊరేగింపు మొదలై 3 గంటలకు బ్రాహ్మణ వీధిలోని ఆంజనేయస్వామి గుడివద్దకు వెళ్లి అక్కడి నుంచి జాతర ప్రారంభమవుతుందన్నారు. కాబట్టి ఇరువర్గాలు సంతోషంగా కలిసిమెలసి ఉత్సవంలో పాల్గొనాలన్నారు. జాతర పొడవునా యువకులు కర్రసాము, కత్తిసాము, తదితర విన్యాసాలు చేస్తారు కాబట్టి అందరూ ఈ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని, అలాంటప్పుడే జాతర మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముఖ్యంగా మసీదు వద్దకు జాతర ఊరేగింపు వచ్చేసరికి ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని సూచించారు. కడప డీఎస్పీ ఆదేశాల మేరకు జాతరలో పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. ప్రజలందరూ పాల్గొని మరో మారు చెన్నూరు మత సామరస్యానికి ప్రతీక అని నిరూపించుకోవాలని కోరా రు. ఇరు వర్గాల మత పెద్దలు ఇందుకోసం సహకరించుకోవాలన్నారు. గ్రామ పెద్దలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, షబ్బీర్ హుస్సేన్, అష్రత్, వారిష్, బషీర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, మునీర్, మంజూర్, పి.వీరారెడ్డి, జుమన్, అబ్దుల్ రబ్, అన్వర్, సుదర్శన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ పార్థసారథి

ప్రారంభమైన లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

పెండ్లిమర్రి, మే 20: మండలంలోని వెయ్యి నూతులకోనలో వెలసిన శ్రీలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో సోమవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమైనట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విశ్వక్సేన ఆరాధన, ధ్వజారోహనం, 21 మంగళవారం అష్టోత్తర శతకళశ స్నపనం, రాత్రి శేషవాహనం, 22న శ్రీలక్ష్మీ నృసింహ జయంతి, రాత్రి హనుమత్ వాహనం, 23న సూర్యప్రభ వాహనం, సాయంత్రం ఊంజల్ సేవ, సాయంత్రం అన్నమయ్య గీతాలాపన, రాత్రికి నాటక ప్రదర్శనతో పాటు గరుడసేవ ఉత్సవం ఉంటుందన్నారు. 24న స్వామివారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నామని, మధ్యాహ్నం గజవాహనం సేవ, చక్రస్నానం, సాయంత్రం ధ్వజా అవరోహణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.


వెయ్యనూతుల కోనలో వెలసిన లక్ష్మీనృసింహ స్వామి

వీరపునాయునిపల్లెలో వాన

వీరపునాయునిపల్లె, మే 20: మండలంలో సోమవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. గాలివాన, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అరగంట పాటు విపరీతంగా గాలులు వీచడంతో వరుణదేవుడు కూడా తగ్గకుండా భారీగా ఏకదాటిగా వర్షం కురిపించాడు. ఉక్కపోత నుంచి జనం ఉపశమనం పొందారు. గత రెండు రెండు రోజుల క్రితం వరకు ఈరోజు కురిసిన వర్షంతో పదును వర్షం కురిసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

వేంపల్లె, మే 20: ప్రముఖ సినీనటుడు జూనియర్ నందమూరి తారక రామారావు పుట్టిన రోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పండ్లు, సీట్లు పంపిణీ చేశారు.

తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్‌యూ, పీఎస్‌యూ ప్రతినిధుల డిమాండ్

కడప (ఎర్రముక్కపల్లె), మే 20:జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నారని, అలాంటి కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌ఐఓ కార్యాలయంలో ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్యకు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలువేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. వీటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు.


ఆర్‌ఐఓకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల ప్రతినిధులు

'టీడీపీ గెలుపు తథ్యం'

వేంపల్లె, మే 20: తెలుగు దేశం పార్టీ గెలుపు తథ్యమని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి తెలిపారు. వేంపల్లెలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు టీడీపీని ఆదరించారన్నారు. మళ్లీ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతారని, అభివృద్ధి - సంక్షేమం సమపాళ్లలో ముందుకు తీసుకెళతారని తెలిపారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా అన్నిచోట్లా టీడీపీ కార్యకర్తలు బలంగా ఎదురొడ్డి పనిచేశారని, ఫలితాల ద్వారా టీడీపీ బలమెంతో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జ్యోతిరెడ్డి, వెంకటేశు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జయరామిరెడ్డి తదితరులు

వేసవి వినోద శిబిరం అభినందనీయం: ఎంఈఓ

కడప (ఎర్రముక్కపల్లె), మే 20:విద్యార్థులకు వేసవి వినోద శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కడప ఎంఈఓ నారాయణ తెలిపారు. సోమవారం కడప నగరం ఆర్‌కేనగర్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి వినోద శిబిరాన్ని ఎంఈఓ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నిర్మాణంలో కీలకమైన బాధ్యత పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటలు, పాటలు మేజిక్, డ్యాన్స్, పేపరు కటింగ్, కథలు చెప్పడంతో పిల్లలు ఆనందంగా స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, డాక్టర్ మామిడి బాబు, సునీత, శివరాం, కిరణ్‌కుమార్, రంగనాయకులు కామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ నారాయణ

తడి, పొడి చెత్తను ప్రజలే వేరు చేసేలా అవగాహన పెంచాలి

● కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప (ఎర్రముక్కపల్లె), మే 20 : తడి, పొడి చెత్తను ప్రజలే వేరు చేసేలా వారిలో అవగాహన పెంచాలని కమిషనరు ప్రవీణ్‌చంద్ తెలిపారు. సోమవారం ఎంపీసీ, ఎంఆర్‌ఎఫ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉక్కాయపల్లె గార్బేజ్ ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కంపోస్టు వేసే ముందుభాగంలో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అలాగే నైట్‌షిఫ్ట్‌లో మెయిన్ రోడ్డు క్లీన్ చేయించాలన్నారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలన్నారు. దీంతో పాటు మరికొన్ని సూచనలను వారికి అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


శానిటరీ అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

భక్తిశ్రద్ధలతో బసవ జయంతి

పులివెందుల టౌన్, మే 20: పట్టణంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం బసవ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరశైవ గురుజంగమ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు భీమ లింగస్వామి, బసవేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఎడ్లబండిపై బసవేశ్వరుని చిత్రపటాన్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు కలశాలు పట్టుకొని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. గ్రామోత్సవం వెంట కోలాటం ప్రత్యేకంగా ఆకట్టుకుంది.


బసవ జయంతి పూజల్లో మహిళలు

ఆదర్శ పాలకులు ఆంధ్రకేసరి, బ్రహ్మానందరెడ్డి

వేంపల్లె, మే 20: మాజీ ముఖ్యమంత్రులు టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి, కాసు బ్రహ్మానందరెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా సోమవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, సమైక్య మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా అటు కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రానికి, దేశానికి ఎనలేని సేవ చేశారన్నారు. సైమన్ కమిషన్‌కు ఎదురొడ్డి ఆంధ్రకేసరిగా పేరుగాంచారన్నారు. విజయవాడ వద్ద కృష్ణానదిపై నిర్మించిన ప్రకాశం బ్యారేజీ ఆయన మానస పుత్రిక అన్నారు. అలాగే స్వర్గీయ కాసుబ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా, కేంద్రమంత్రిగా, ఏఐసీసీ అధ్యక్షుడిగా, గవర్నరుగా అటు కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రానికి, దేశానికి ఎంతో సేవచేశారన్నారు. ఆయన గొప్ప పరిపాలన దక్షుడు, సిసలైన సమైక్యవాది, బీసీలకు విద్య, ఉద్యోగాలలో 25 శాతం రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, అమర్‌నాథరెడ్డి, ఉత్తన్న, వేమయ్య, వెంకటేశు, నాగరాజు, కుక్కల రాజ, రవి తదితరులు పాల్గొన్నారు.


టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

వృద్ధులను ఆదరించాలి : సీఐ

ప్రొద్దుటూరు టౌన్, మే 20: వృద్ధులను ఆదరించాలని రూరల్ సీఐ రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమానికి మీకోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువచేసే నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రమణారెడ్డి మాట్లాడుతూ ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైత్ సహకారంతో నిత్యావసర వస్తువులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐలు చిరంజీవి, శివప్రసాద్, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు మురళి, సూర్యనారాయణరెడ్డి, ఆదరణ సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్, నరేష్, ఆశ్రమ నిర్వాహకుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు,


వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

ఎవరి లెక్కలు వారివి..!

మైదుకూరు, మే 20 : మైదుకూరు నియోజకవర్గంలో ఓటరు నాడి పట్టుకోవడానికి అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. మెజార్టీయా లేక స్వల్ప ఆధిక్యమా అని ఇరు పార్టీల ప్రధాన అభ్యర్థులు గెలుపు మాదే పక్కా అంటూ పైకి గాంభీర్యం.. లోలోన భయం పట్టుకుంది. సోమవారం పోలింగ్ ప్రక్రియ ముగిశాక మైదుకూరు నియోజకవర్గంలో నమోదైన పోలింగ్ వివరాలు స్పష్టమ య్యాయి. దీంతో విజయావకాశాలపై అటు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్, ఇటు వైసీపీ అభ్యర్థి రఘురామిరెడ్డిఅంచనాలు వేస్తూ తలమునకలవుతున్నారు. ఫలితాల వెల్లడికి ఇంకా 14 రోజులు వ్యవధి ఉండటంతో గెలుపు ఎవరి సొంతమవుతుందనే దానికి మైదుకూరులో విశ్లేషణలు జోరందుకున్నాయి. వీటన్నింటితో పాటు దాదాపు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఓటర్లకు నగదు పంపకాలు జరిగాయి. ఆ ప్రభావం ఎంత వరకు ఉంటుందనే దానిపై అంచనాలు వేస్తున్నారు.

మెజార్టీయా ? స్వల్ప ఆధిక్యమా ?..: 2019 ఎన్నికల్లో మైదుకూరు నియోజకవర్గంలో 78.30 శాతం పోల్ కాగా 2024 సోమవారం జరిగిన ఎన్నికల్లో 84.82 శాతం పెరగడంతో అది ఎవరికి లాభం అన్న దానిపైనా మైదు కూరు నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది. మెజారిటీ వస్తుందని కొందరు స్వల్ప ఆధిక్యంతో అయినా గెలుస్తామని ధీమాలోఅభ్యర్థులప్రధానఅను చరులున్నారు. నాకు 78 ఏళ్ళు ఉన్నాయి. నాకు ఇవే చివరి ఎన్నికలు అంటూ రఘురామిరెడ్డి ఓటర్లను కోరగా, 12 ఏళ్ళుగా కష్టాలు చూశారు. రెండు పర్యాయాలు పోటీ చేసి ఓటమి చెందినా, నేను డబ్బులు కోసం రాజకీయాల్లో రాలేదు కేవలం నా నియోజకవర్గం అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు సేవ చేసేందుకే వచ్చా, ముచ్చటగా మూడో సారి పోటీ చేస్తున్న నన్ను గెలిపించండంటూ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఓటర్లను వేడుకుంటూ చంద్ర బాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు.

మహిళలు, యువత చైతన్యం..: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు చైతన్యం స్పష్టంగా కనిపించింది. యువత, మహిళలు పెద్ద ఎత్తున ఓటేసేం దుకు పోలింగ్‌కేంద్రాల వద్ద బారులు తీశారు. గంటల తరబడి నిల్చొని ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కార్యకర్తలకు టీడీపీ అండ

కడప (ఎర్రముక్క పల్లె), మే 20 : కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చెన్నంశెట్టి మురళీక్రిష్ణ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గౌసనగర్‌లో జరిగిన ఘర్షణలకు కార్యకర్తలకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా తమ్ముడు, అతని అల్లుళ్లు గౌస్‌నగర్‌లో అల్లర్లు సృష్టించడానికి కావాలనే గుంపులు గుంపులుగా వాహనాల్లో వచ్చారన్నారు. అక్కడ టీడీపీ కార్యకర్తలు కొద్దిమంది మాత్రమే ఎన్నికల విధుల్లో ఉండగా గుంపులుగా వచ్చిన వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలపైన రాళ్లు రువ్వి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. ఈ విషయం విధుల్లో ఉన్న పోలీసులకు ఎన్నికల సిబ్బందికి తెలుసన్నారు. అలాగే సీసీ కెమెరాల్లోని ఫుటేజీల్లో చూస్తే అసలు విషయం తెలుస్తుందన్నారు. దీనిపై టీడీపీ కార్యకర్తలపై ఆరోపణలు చేయడం సరికాదన్నార. టీడీపీ కార్యకర్తలు భయపడవద్దన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి ఎప్పుడూ అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న చెన్నంశెట్టి మురళి

నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జమ్మలమడుగు, మే 20: జమ్మలమడుగులో సోమవారం నుంచి నారాపురం వేంకటేశ్వరస్వామి క్రోధినామ సంవత్సర వార్షిక బ్రహ్మోత్సవాలు అంకురార్పణంతో ప్రారంభం అయ్యాయి. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో అంకురార్పణం పూజలు నిర్వహించారు. రాత్రి మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఛైర్‌పర్సన్ తాతిరెడ్డి తులసి దంపతులు పూజలో పాల్గొని మొక్కుకున్నారు. అన్నమాచార్య కీర్తనలు, సేనాధిపతి ఉత్సవం, హరికథా కార్యక్రమాలు ఆలయంలో చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు.

మానసిక వికాసానికి సోపానం వేసవి శిబిరం

ప్రొద్దుటూరు టౌన్, మే 20: మానసిక వికాసానికి వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడుతాయని ఉపాధ్యాయురాలు నిర్మలాజ్యోతి పేర్కొన్నారు. సోమవారం రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు నిర్మలాజ్యోతి విద్యార్థులకు భారతీయ పురాణాలపై అవగాహన కల్పించారు. అనంతరం గంగాధర్‌రెడ్డి, జిరాఫీచెస్ గురించి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీంసాహెబ్, రెహెమాన్‌ఖాన్, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 20: అన్నదానం పుణ్యకార్యమని శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం శివాలయంలో 500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాలయంలో రెండు సంవత్సరాలుగా దాతలు సహకారంతో పేద ప్రజలకు ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ సభ్యులు సూర్యనారాయణరెడ్డి, విష్ణునారాయణ, విజయ కుమార్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరి లెక్కలు వారివి..!

● మెజార్టీయా ? స్వల్ప ఆధిక్యమా? ● పైకి గాంభీర్యం.. లోలోన భయం ● బూత్‌ల వారీగా వివరాలు సేకరణ ● ఉత్కంఠగా మైదుకూరు



పోలింగ్ సమయం ముగిసినా శెట్టివారిపల్లెలో బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

మైదుకూరు, మే 20 : మైదుకూరు నియోజకవర్గంలో ఓటరు నాడి పట్టుకోవడానికి అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. మెజార్టీయా లేక స్వల్ప ఆధిక్యమా అని ఇరు పార్టీల ప్రధాన అభ్యర్థులు గెలుపు మాదే పక్కా అంటూ పైకి గాంభీర్యం.. లోలోన భయం పట్టుకుంది. సోమవారం పోలింగ్ ప్రక్రియ ముగిశాక మైదుకూరు నియోజకవర్గంలో నమోదైన పోలింగ్ వివరాలు స్పష్టమయ్యాయి. దీంతో విజయావకాశాలపై అటు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్, ఇటు వైసీపీ అభ్యర్థి రఘురామిరెడ్డిఅంచనాలు వేస్తూ తలమునకలవుతున్నారు. ఫలితాల వెల్లడికి ఇంకా 14 రోజులు వ్యవధి ఉండటంతో గెలుపు ఎవరి సొంతమవుతుందనే దానికి మైదుకూరులో విశ్లేషణలు జోరందుకున్నాయి. వీటన్నింటితో పాటు దాదాపు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఓటర్లకు నగదు పంపకాలు జరిగాయి. ఆ ప్రభావం ఎంత వరకు ఉంటుందనే దానిపై అంచనాలు వేస్తున్నారు.

మెజార్టీయా ? స్వల్ప ఆధిక్యమా ?..: 2019 ఎన్నికల్లో మైదుకూరు నియోజకవర్గంలో 78.30 శాతం పోల్ కాగా 2024 సోమవారం జరిగిన ఎన్నికల్లో 84.82 శాతం పెరగడంతో అది ఎవరికి లాభం అన్న దానిపైనా మైదుకూరు నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది. మైజారిటీ వస్తుందని కొందరు స్వల్ప ఆధిక్యంతో అయినా గెలుస్తామని ధీమాలోఅభ్యర్థులప్రధానఅను చరులున్నారు. నాకు 78 ఏళ్ళు ఉన్నాయి. నాకు ఇవే చివరి ఎన్నికలు అంటూ రఘురామిరెడ్డి ఓటర్లను కోరగా, 12 ఏళ్ళుగా కష్టాలు చూశారు. రెండు పర్యాయాలు పోటీ చేసి ఓటమి చెందినా, నేను డబ్బులు కోసం రాజకీయాల్లో రాలేదు కేవలం నా నియోజకవర్గం అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు సేవ చేసేందుకే వచ్చా, ముచ్చటగా మూడో సారి పోటీ చేస్తున్న నన్ను గెలిపించండంటూ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఓటర్లను వేడుకుంటూ చంద్ర బాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. దీంతో ఎవరెన్ని లెక్కలు వేసినా ఇరువురిలో ఎవరి మాట విని ఓటర్లు ఓట్లు వేశారో ఫలితం వెలువడే వరకు వేచి చూడాలి.

మహిళలు, యువత చైతన్యం..: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు చైతన్యం స్పష్టంగా కనిపించింది. యువత, మహిళలు పెద్ద ఎత్తున ఓటేసేం దుకు పోలింగ్‌కేంద్రాల వద్ద బారులు తీశారు. గంటల తరబడి నిల్చొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలే అధికంగా ఓట్లు వేశారు. మైదుకూరు నియోజక వర్గంలో 2019 జరిగిన ఎన్నికల్లో 82.60శాతం, కాగా ఈ ఎన్నికల్లో 84.82 శాతానికి పెరిగింది. మైదుకూరు నియోజకవర్గంలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 7 లోపుల ముగియగా, మున్సిపల్ పరిధిలోని శెట్టివారిపల్లెలో రాత్రి 9 గంటల వరకు, బి మఠం మండలం డీ నేలటూరు పోలింగ్ కేంద్రలో 7 గంటల సమయంలో కూడా ఓటింగ్‌జరుగుతుండగా వర్షం ధాటికి విద్యుత్ సరఫరా నిలిచిపోయి అధికారులు జనరేటర్ ఏర్పాటు చేసేంత వరకు ఉండి దాదాపు 10 గంటల ప్రాంతంలో పోలింగ్ ముగిసింది. దీంతో రెండు ప్రధాన పార్టీలు ఉత్కంఠగా ఉన్నాయి. మెజారిటీ యువత, మహిళలు ఎటువైపు తీర్పు ఇచ్చారన్న విషయంపై ప్రధానంగా చర్చ కొనసాగుతోంది.

బూత్‌లవారీగా వివరాలపై లెక్కలు..: రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాల్ని తెప్పించుకొని విశ్లేషించుకుంటున్నారు. ఈ అంశాలపై అనుభవం ఉన్న విశ్లేషకులను పిలిపించుకొని చర్చలు చేస్తున్నారు. పోటీకి అనుకూలంగా జరిగిన పోలింగ్ కేంద్రాలు పక్కన పెట్టి తీవ్ర పోటీ నెలకొన్న వాటి లెక్కలు తేల్చడం వారికి మరింత కష్టంగా మారింది. ఆయా ప్రాంతాల్లో పోలింగ్ ఏవిధంగా జరిగింది. అక్కడ పంపకాలు ఎంత జరిగాయి. వాటిలో తమకు ఎన్ని ఓట్లు వచ్చింటాయా ప్రత్యర్థులకు ఎన్ని ఓట్లు పడిఉంటాయి అనే దానిపై అధినాయకులు బిజీ బిజీగా ఎవరి లెక్కలు వారివే అన్నట్లుగా గడుపుతున్నారు.

పోలీసుల నాకాబందీ

పోరుమామిళ్ల, మే 20 : పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోరుమామిళ్ల, రంగసముద్రం పంచా యతీల్లో నాకాబందీ నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని మరో చోట ఉత్పన్నం కాకుండా చూసేందుకు పోరుమామిళ్లలో కొందరి నివాస గృహాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అలాగే గిరినగర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న మూడు మోటారు బైకులు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ ఎవరైనా ఎంతటి వారైనా ఘర్షణ వాతావరణం సృష్టిస్తే ఉపేక్షించేది లేదని కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఉదయం జీపుల్లో పోలీసు సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. వాహనాల్లో తిరిగి అనుమానిత ప్రాంతాల్లో హెచ్చరికలు, సోదాలు చేశారు.

ఊరేగింపుగా దర్గాకు పూలచాందిని

ఖాజీపేట, మే 20: హజరత్‌ఖాజా సయ్యద్ నక్షహర్ షావలి ఉరుసు పురస్కరించుకుని పూలచాందిని మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఖాజీపేట మసీదు దగ్గరగల దర్గా నుంచి అగ్రహారం దర్గాకు తీసుకెళ్లారు. మంగళవారం సరంఖాన్‌పేట నుంచి జెండా ఊరేగింపుగా ముస్లింలు తీసుకెళ్లనున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు. నాలుగురోజులుగా నిర్వహించే ఈ ఉరుసు ఉత్సవాలకు గట్టి బందోబస్తు నిర్వహించినట్లు సీఐ రామాంజులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బడే గౌస్‌పీరాఖాద్రీ ఉరుసు

జమ్మలమడుగు, మే 20: జమ్మలమడుగు పట్టణంలోని పలగాడి వీధిలో వెలసిన తూగుట్లపల్లె జాగీర్దార్ హజరత్ సయ్యద్‌షా బడే గౌస్‌పీరాఖాద్రీ ఉరుసు ఉత్సవ సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గాలో పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్ల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేసి మొక్కుకున్నారు. సర్వమత సమ్మేళనం, సర్వమత పెద్దలచే ప్రసంగ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు పట్టణంలోని పెద్దలు, స్వామివారి శిష్యులు పాల్గొన్నారు.

క్రాకర్స్ అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు

బద్వేలుటౌన్, మే 20 : అనుమతులు లేకుండా క్రాకర్స్ అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ యుగంధర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు దుకాణాల్లో క్రాకర్స్ షాపులను సీఐ యుగంధర్, ఎస్ఐ సత్యనారాయణలు తమ సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో తనిఖీలు చేపట్టామని సీఐ యుగంధర్ అన్నారు. వ్యాపారస్తులు ఎవరైనా క్రాకర్స్‌కు అనుమతులు లేకుండా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

రేపు మండల సర్వసభ్యసమావేశం

కాశినాయన .మే20: ఈనెల 21 బుధవారం నర్సాపురం వెలుగు కార్యాలయ సభాభవనంలో మండల సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు.ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు అధికారులు ఇతర ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

పబ్లిక్ నోటీసు

నా కక్షిదారుడైన కీ॥శే॥ నరాల సుబ్బారెడ్డి కుమారుడు నరాల చిన్న సుబ్బారెడ్డి సాకిన్ డి.నెం. 1-19, ప్రస్తుతం 1/70, బొల్లవరం గ్రామం, ప్రొద్దుటూరు టవున్ & మండలం, వైఎస్ఆర్ కడపజిల్లా గారి నుండి సరియైన ఇన్‌స్ట్రక్షన్స్ తీసుకొని ఇచ్చు పబ్లిక్ నోటీసు ఏమనగా, రాజశ్రీ ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు నా కక్షిదారుడు దావా మొత్తం రూ. 77,48,820 రాబట్టుట నిమిత్తం ప్రొద్దుటూరు టవున్ వసంతపేట డి.నెం. 27/199 ఇంటిలో నివాసం ఉండిన **తలారి మత్తేసు అలియాస్ మత్తేష్ భార్య తలారి దేవకుమారి** చనిపోయినందున **ఆమె వారసులైన భర్త తలారి మత్తేసు అలియాస్ మత్తేష్ ఇద్దరు కుమార్తెలు 1) వినోద్ భార్య తలారి మేరి 2) నవీన్ భార్య బి. ప్రియాంకలపై** O.S. No. 12/2024 దావాను దాఖలుచేసి అట్టి దావాలో I.A.No. 516/2024 పిటీషనులో పై కోర్టు వారు సదరు తలారి దేవకుమారికి చెంది ఆమె చనిపోయినందున పై చెప్పిన ఆమె వారసుల చేతిలో ఉన్న దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని 18-6-2024వ తేదిలోపు పై దావా మొత్తానికి థర్డ్ పార్టీ ష్యూరిటీ ఇవ్వడం లేదా పై దావా మొత్తం పై కోర్టు నందు 18-6-2024వ తేది లోపల డిపాజిట్ చేయవలెనని లేనిచో సదరు స్థిరాస్తిని హోల్ జప్తి చేయమని ఉత్తర్వు ఇచ్చి వున్నారు పై వారసులు కోర్టు నుంచి వచ్చిన సంబంధిత నోటీసులు తీసుకొని ఉన్నారు. అయితే ఇటీవల పై చెప్పిన వారు షెడ్యూలు ఆస్తిని ఇతరులకు అమ్ముటకు ప్రయత్నాలు చేయుచున్నారు. కాబట్టి పబ్లిక్‌కు తెలియజేయడమేమనగా షెడ్యూలు ఆస్తిని పైన తెలియజేసిన వారి నుంచి కొనడం, అమ్మడం ఇతరత్రా బదలాయింపులు అన్యాక్రాంతములు, ఆస్తిహక్కు బదిలీలు మరియు ఇతరములు చేయకూడదు. అలా చేస్తే అవి చెల్లనేరవు పై కోర్టు తీర్పుకు లోబడి ఉంటాయి.

SCHEDULE

Kadapa District, Proddatur Sub District, Proddatur Town, Municipality Area, Vasanthapeta Harijanawada Street, Interior part of Weaker Section Area, Previously Madras Terraced (Penkutillu) House with Old D.No. 27/99, New D.No. 27/199 at present R.C.C. Mahadi Midde House bounded as follows :
East : Rasta, West : House of Talari Chinna Pullanna bearing D.No. 27/198, North : Midde House of Dorasanipalle John, South : Kaluva (Canal). Within these boundaries Site admeasuring East-West ; 25 feet or 7.62 meters and North-South : 52 feet or 15.850 meters. Within this site R.C.C. Midde House with the above said measurements with the above said door number. Above the said R.C.C. Midde House, R.C.C. Roof Mahadi House with the above said measurements along with roof, doors, doorways, current meters, meters deposits with all easement rights

ఇట్లు, **వి. రమేష్‌బాబు,** అడ్వకేట్, ప్రొద్దుటూరు.

కొద్దిపాటి వర్షానికే ఇలా... వాహనాలు పోయేదెలా..?

బద్వేలుటౌన్, మే 20 :ఉరుములు, మెరుపులతో సోమవారం కురిసిన ఓ మోస్తారు వర్షంతో బద్వేలు పట్టణంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. వర్షం నీరు డ్రైనేజీల్లో నిల్వఉండి రోడ్లపై ప్రవహిస్తుండటంతో పలువాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చినుకుపడిందంటే సిద్దవటంరోడ్, మైదుకూర్‌రోడ్‌లన్నీ అస్తవ్యస్తంగా తయారై నీరు నిల్వ ఉండటంతో చెరువులను తలపించే విధంగా రహదారుల్లో ఉండ టంతో వాహనదారులు, బాటసారులు ఎలా పోయేదంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. మోకాలిలోతులో నీరు నిలబడి ఉండటంతో, డ్రైనేజీ నీటితో దుర్గంధం వెదజల్లుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. వేసవికాలంలోనే ఇలా చిన్నపాటి వర్షానికే రహదారులన్నీ జలమయమైతే, మరి వర్షాకాలం వస్తే పరిస్థితి ఏమిటంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డ్రైనేజీలపై ప్రత్యేక శ్రద్ధ కనపరిచి పూడికతీత పనులను చేయాలంటూ ప్రజలు కోరుతున్నారు.



కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తున్న జాతీయ రహదారి, మైదుకూరురోడ్డులోని స్టేట్‌బ్యాంకు వద్ద ఇబ్బందులు పడుతున్న ద్విచక్రవాహనదారుడు

మురుగు కూపంగా రంగునీళ్ల కాలువ





మోరగుడి రంగునీళ్ల కాలువ, రోడ్డు పక్కన వ్యర్థాలు

జమ్మలమడుగు, మే 20: జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం శ్రీరాములపేట వద్ద రంగునీళ్ల కాలువ మురుగు కూపంలా మారింది. మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామం పెన్నానది నుంచి కాలువ మోరగుడి మీదుగా పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామం దాకా ఈ కాలువ బ్రిటీష్‌కాలంలో మంచినీళ్లకోసం తీసినట్లు అప్పట్లో ఆ కాలువకు రాణి కాలువగా పేరు గాంచింది. ఇప్పుడు ఆ కాలువ రాణికాలువ పోయి రంగునీళ్ల కాలువ పేర చలామణిలో ఉంది. అప్పటి రాజులు కాలువ ఆశయం చాలా గొప్పదని చెప్పుకుంటుంటారు. అయితే కొన్ని సంవత్సరాలుగా రాణి కాలువలో బయటి ప్రాంతాల ప్రజలు వ్యర్థాలు, జంతు కళేబరాలువేయడంతో కంపుకొడుతోంది. మోరగుడి గ్రామంలోని పలు ప్రాంతాలకు చెందిన వర్షపునీరు కాలువలో చేరి పెన్నానదిలోకి వెళ్లేది. ప్రస్తుతం వ్యర్థాలు నిండుకుని కంపచెట్లు మొలిచాయి. కొందరు ఆక్రమణ చేశారు. అయితే జమ్మలమడుగు నుంచి మైలవరం వెళ్లాలన్నా ఆదారిలో ప్రధాన రోడ్డు పక్కనే రంగునీళ్ల కాలువ మురుగుకంపు కొడుతోంది. శ్రీరాములపేటలో అద్దకపు బట్టీల నుంచి కలుషిత నీరు కాలువలో చేరి ఉదయం, రాత్రివేళల్లో ఎక్కువగా కంపుకొడుతోంది. ఇప్పటికైనా కాలువ శుభ్రం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. రంగునీళ్లలో దోమలు పెరిగి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు పక్కన డ్రైనేజీ దుర్గంధం

బీసీ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



మాట్లాడుతున్న బీసీ నాయకుడు బొర్రా రామాంజనేయులు తదితరులు

ప్రొద్దుటూరు , మే 20 : పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభచాటిన బీసీ విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానం చేయనున్నట్లు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం బీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పది, ఇంటర్‌పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకు ప్రథమ బహుమతి 5000 ద్వితీయ బహుమతి 4000 వేలు బాల బాలికలకు వేరువేరుగా ఇవ్వబడతాయన్నారు. అలాగే ఇంటర్ లో అన్ని గ్రూపుల వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామన్నారు. పేదవిద్యార్థులకు 3000 వేల వంతున ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. మే 26 ఆదివారం ఉదయం 10 గంటలకు పద్మశాలీయ కళ్యాణ మండపంలో ఈ ప్రతిభా అవార్డుల ప్రదానం చేయబడుతుందన్నారు. సమావేశంలో బీసీ నేతలు సంటెన్న, మాదాసు మురళీ ,జీసీ పుల్లయ్య, మాడిశెట్టి ప్రతాప్, పోసా మల్లికార్జున ,బత్తల శ్రీనివాసులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి



వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 20: వృద్ధులను ఆదరించాలని రూరల్ సీఐ రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమానికి మీకోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువచేసే నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రమణారెడ్డి మాట్లాడుతూ ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైత్ సహకారంతో నిత్యావసర వస్తువులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు మురళి, సూర్యనారాయణరెడ్డి, ఆదరణ సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్, నరేష్, ఆశ్రమ నిర్వాహకుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు,

ప్రైవేటు ఉపాధ్యాయ హక్కులను కాపాడాలి

ప్రొద్దుటూరు టౌన్, మే 20: కార్పొరేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయులహక్కులను కాపాడాలని ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు పేర్కొన్నారు. సోమవారం పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ రాఘవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీటీఎల్‌యూ కడప కన్వీనర్ శంకర్, ప్రైవేటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్య సంపద వృద్ధికి తిలోదకాలు

చేప పిల్లల పెంపకంపై నిర్లక్ష్యం ● లక్షలు ఖర్చు పెట్టి లక్షణంగా వదిలేసిన వైనం

మైలవరం, మే 20 : మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూపొందించిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం లక్ష్యం చేరడం లేదు.కేంద్రం నిర్మాణ పనులు మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్దేశించుకున్నా ఇప్పటికీ మందకొడిగానే సాగుతున్నాయి. పూర్తయిన నిర్మాణాలను పరిశీలిస్తే ఎక్కడ చూసినా పగుళ్లు, చీలికలే కనిపిస్తున్నాయి. కంప చెట్లు ఏపుగా పెరిగి భవనాలు, తొట్లు కనిపించకుండా అధ్వానంగా దర్శనమిస్తుంది. మైలవరం జలాశయం సమీపాన నిర్మించిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నిరుపయోగంగా మారింది. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి 2005, మే 24న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శిలాఫలకం వేశారు. రూ.2 కోట్ల నిధులు మంజూరు కావడంతో సుమారు 11ఏళ్ల అనంతరం 2016లో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి పనులు చేపట్టారు. పనులు కొంత మేర జరిగినా నిధులు లేక పూర్తి కాలేదు. చేపల ఉత్పత్తి కేంద్రంలో మౌళిక వసతులైన విద్యుత్, పైపులైన్, బండల చప్పట తదితర పనుల కోసం మరిన్ని నిధులు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు.

● తొట్లలో చీలికలు

తల్లి చేపలను పెంచేందుకు బ్రీడర్స్ పాండ్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన నాపరాయి బండలు చాలా చోట్ల కుంగిపోయాయి. చేప పిల్లల కోసం 50 నర్సరీలు, తల్లి చేపలు పెంచేందుకు బ్రీడర్స్ పాండ్ కార్యాలయ భవనాలు, పూర్తయ్యాయి.నర్సరీలోని వృథా నీరు బయటకు పోయేందుకు కాలువలు నిర్మించాల్సి ఉంది.సిమెంటు తొట్ల పరిస్థితి అధ్వానంగా మారింది. అనేక చోట్ల నెర్రెలు ఏర్పడి చీలికలు వచ్చాయి.వాటిలో నీళ్ల నింపితే అవి నిలబడవని మత్స్యకారులు చెబుతున్నారు. ఇప్పటికీ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో పనులు కాకపోవడంతో ప్రస్తుతం కంపచెట్లు పెరిగి అధ్వానంగా దర్శనమిస్తుంది. పనులు చేసేందుకు దాదాపు 43 లక్షలకు పైగా నిధులు కావాలని ఉన్నతాధికారులకు అధికారులు నివేదికలు పంపించారు. ఆ నిధులు ఎప్పుడు వస్తాయో పనులు ఎప్పుడు పూర్తి చేసి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఎప్పటికి అందుబాటులోకి వస్తుందోనని ఎదురుచూస్తున్నారే తప్ప పనులు ముందుకు సాగడం లేదు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని త్వరగా పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని మత్స్యకారులు కోరుతున్నారు.



మధ్యలోనే ఆపేసిన బిల్డింగ్ పనులు